

# ఉప్పు సముద్రం

## వారాల కృష్ణమూర్తి

'....నర్మద చాల తెలివైన అమ్మాయి కాలేజీ మొత్తానికి తానొక్కతే ఫస్ట్ క్లాస్‌లో పాసయింది ఇంటర్. మెడిసన్ ఎన్‌ట్రన్స్‌కు ప్రిపేర్ కమ్మని చెప్పాలి! ...' అని అనుకుంటుండగా.... "నమస్కారం మాస్టారూ!" అంటూ వచ్చింది నర్మద గదిలోనికి.

"నమస్కారం!ఏమ్మా బాగున్నావా!!" ఆప్యాయంగాఅడిగాడు ప్రిన్సిపాల్ రాఘవరావ్. బాగున్నానంటూ తలాడించింది నర్మద.

"నీవు మెడిసన్ ఎన్‌ట్రన్స్‌కు ప్రిపేర్ కావాలమ్మా,నీకుతప్పకుండ సీటువస్తుంది. బాగా చదివి పెద్ద డాక్టర్‌వి కావాలి. .." నర్మద వైపు చూశాడు. తను చెబుతుంది శ్రద్ధగా వింటుంది నర్మద. కాసేపయాక "'. ఇంతకూ నీకు చదవాలనుందా! మీ నాన్నగారు ఏమంటున్నారు?" అంటూ అనుమానంగా చూశాడు నర్మద వైపు.

"మా నాన్న. చదువుతానంటే వద్దనడు. నాకూ చదవాలనే వుంది. మెడిసన్‌లో చేరితే బావుంటుంది. మరి సీటు వస్తుందో రాదో."

"సీటు గురించి ఆలోచించక బాగా చదువు ఎగ్జామ్ బాగా రాశావంటే సీటు తనంతతానే వస్తుంది నిన్ను వెతుక్కుంటూ!"

"అలాగే మాస్టారూ! మరి నేను శలవు తీసుకుంటాను." అంటూ చేతులు జోడించింది. రాఘవరావ్ "మంచిదమ్మా!" అన్నాడు.

నర్మదకష్టపడి చదివింది ఎన్‌ట్రన్స్‌కు. ఎగ్జామ్ అవగానే 'హమ్మయ్యా! ఎన్‌ట్రన్స్ టెస్ట్ అంటే ఇంతేనా! ఈమాత్రం దానికి హడలిపోయాను.' అనుకుంటూ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. తనకు తప్పక యం. బి. బి. యస్. లో సీటు వస్తుందని మరే కాలేజీలోనూ చేరలేదు నర్మద.

నర్మద అనుకున్నట్టుగానే ఎన్‌ట్రన్స్ టెస్ట్‌లో పాసయింది. ఇంటర్వ్యూకెళ్ళింది. ఇంటర్వ్యూలోనూ పాసయి ఫీజు కట్టి కాలేజీలో చేరింది.

నర్మద యం. బి. బి. యస్.లో చేరిందని తెలిసి తానే చేరినట్టు సంతోషించాడు రాఘవరావ్. తన స్టూడెంట్ డాక్టర్ అవబోతుంది...అని అనుకున్నప్పుడు ఎంతో

ప్తిగా వుండేది. బాగా శ్రద్ధగా చదవ మని ఓ ఉత్తరం వ్రాసి పోస్ట్ చేశాడు.

* * *

"నమస్కారం మాస్టారూ! ...."

ఎవరా వచ్చిందని తలెత్తి అనుకో కుండా వచ్చిన నర్మదను చూసి ఆశ్చర్య పోయాడు రాఘవరావ్.

"ఏమిటి మాస్టారూ! అలా చూస్తు న్నారు!!"

"ఏమీ లేదు! కూర్చోమ్మా!!" కుర్చీ చూపాడు. నర్మద రాఘవరావ్‌కు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. "కులాసాగా వున్నావా! చదువెలా సాగుతుంది. పెళ్ళి రెండు నెలలన్నా కాలేదు అప్పుడే వచ్చావ్. ఇంటిమీద బెంగా! ...ఇలా అయితే చదువు పాడవదూ ...అందునా డాక్టర్ కోర్సాయె. డాక్టర్‌కోర్స్ అంటే మాటలా! ...." అంటూ అభిమానంతో చివాట్లు వేశాడు రాఘవరావ్.

నర్మద ఏమీ మాట్లాడకుండా తన హాండ్‌బాగ్ తెరిచి ఓ వెడ్డింగ్‌కార్డ్ తీసి రాఘవరావ్ చేతికి అందించింది. ఎవరి దబ్బా అనుకుంటూ చూశాడు రాఘవ రావ్. అందులో ....సాగర్ ....నర్మద.... అన్న పేర్లు చూసి తెల్లబోయి నర్మద వైపు చూశాడు.

"ఏంచైను మాస్టారూ! నాకైతే చదవాలనే వుంది. కానీ మా నాన్న మళ్ళీ ఇలాంటి సంబంధం రాదంటున్నాడు. అమ్మకూడ బలవంతం చేస్తుంది. ఆశల్ని చంపుకుని పరిస్థితులతో రాజీపడడంకన్నా ఆడది ఏం చైగలుగుతుంది " అంటూ తన అశక్తతను వెల్లడిచేసింది నర్మద

"పెళ్ళయ్యాక చదవచ్చుగా!"

"లాభంలేదు మాస్టారు! వాళ్ళ కిష్టం లేదట!!"

"ఇంతకూ అబ్బాయి ఏం చదివాడు?"

"చదువు అంతగా లేదు. బోలెడు ఆస్తి వుంది. వ్యవసాయం చూసుకుంటూ వుంటారు .. "

"మంచిదమ్మా!" నిట్టూర్చాడు రాఘవ రావ్.

"మరి నే వస్తాను మాస్టారూ! మీరు పెళ్ళికి తప్పకుండ రావాలి!!" అంది నర్మద లేస్తూ. రాఘవరావ్ 'వస్తా'నన్నట్టు తల వూపాడు. నర్మద "నమస్తే!" అంటూ శలవు తీసుకుంది.

చాలాసేపువరకు నర్మద వెళ్ళినవైపే చూస్తూ కూర్చున్నాడు ప్రిన్సిపాల్ రాఘవరావ్. నర్మద తెలివైంది. ఆమె విజ్ఞానానికి పెళ్ళి అడ్డుగోడగా నిలుస్తుంది.

ఈ దేశంలో ఎన్నో జీవనదు లున్నాయి. అయినా మనకు నీటి కొరత వుంది. కారణం ఆ జీవజలాల్ని మనం ఉపయోగించుకోలేక వృధాగా ఉప్పు సముద్రంలోనికి వదిలేస్తున్నాం! అలాగే స్త్రీల తెలివితేటల్ని విజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పెళ్ళి అనే తంతుతో వాళ్ళని సంసార సాగరంలో వదిలే స్తున్నాం! ....అనిపించింది రాఘవరావ్‌కు

